ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 20 జనవరి 2024



రా.. కదలిరా బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

కమలాపురంలో జరిగిన రా.. కదలిరా బహిరంగ సభకు హాజరైన జనం





చంద్రబాబునాయుడుకు శాలువా కప్పి గజమాలతో సత్కరించి శ్రీరాముని లోహపు విగ్రహాన్ని ఇస్తున్న పుత్తా నరసింహారెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, పుత్తా లక్ష్మిరెడ్డి తదితరులు

ఈసారి పులివెందుల టీడీపీదే

- జగన్‌ను ఇన్నిసార్లు గెలిపించాం.. మాకు ఒరగబెట్టిందేమిటి అంటూ..
- పులివెందుల వాసులు బాధపడుతున్నారు
- జిల్లాలో కరువు మండలాలు ప్రకటించాలన్న అధికారులపైనే.. ఫైలు విసిరికొట్టారు
- ఒక్కచాన్స్ అంటే అవకాశమిచ్చారు..
- మీ బతుకులు ఏమైనా బాగుపడ్డాయా
- స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేశారా... ఒక్క కాలువ తవ్వారా
- బాగుపడింది ఇద్దరే.. ఒకరు జగన్‌రెడ్డి, మరొకరు ఎంపీ రెడ్డి
- ఎమ్మెల్యేల అవినీతి అక్రమాలు పెరిగాయి
- కమలాపురం సభలో సీఎం జగన్‌పై చంద్రబాబు నిప్పులు
- 90 శాతం సబ్సిడీతో రైతులకు డ్రిప్ ఇచ్చా
- టీడీపీ అధికారంలోకి వస్తే కడప జిల్లా హార్టికల్చర్ హబ్ చేస్తాం
- పెండింగు ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
- చంద్రబాబు ప్రసంగాలకు జనం నుంచి అపూర్వ స్పందన
- కమలాపురం సభ సక్సెస్



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న రితేశ్‌కుమార్‌రెడ్డి, బొజ్జా రోశన్న



హెలీప్యాడ్ వద్ద చంద్రబాబును సత్కరిస్తున్న టీడీపీ నేత సీఎం సురేశ్‌నాయుడు



హెలీప్యాడ్ వద్ద చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ జి.ఉమాదేవి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ జి. లక్ష్మిరెడ్డి

కడప, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): "ఒక్క చాన్స్ అంటూ మీ ముందుకు వచ్చారు. మనవాడే కదా అంటూ 2019 ఎన్నికల్లో కడపలో అన్ని సీట్లు గెలిపించారు. ఇప్పటికీ మీ పరిస్థితి ఏమైనా మారిందా.. మీకు ఉద్యోగాలు వచ్చాయా.. రైతుల జీవితంలో మార్పు వచ్చిందా.. కడపలో ఎవరికైనా న్యాయం జరిగిందా.. ఒకరు జగన్‌మోహన్‌రెడ్డి, రెండు మీ ఎంపీ రెడ్డికి న్యాయం జరిగింది. ఒక్క సాగునీటివ ప్రాజెక్టు అయినా తెచ్చారా... కడపకు స్టీలు ఫ్యాక్టరీ వచ్చిందా.. రైతులకు డ్రిప్ ఇచ్చాడా.. ఇవ్వలేదు. మాటలు కోటలు దాటుతాయి. చేతలు మాత్రం గడప దాటవు.. అదీ జగన్‌మోహన్‌రెడ్డి నైజం. తమ్ముళ్లూ కమలాపురం సాక్షిగా మిమ్మల్ని అడుగుతున్నా.. ఈ జనసందోహం ఉందంటే ఇక ఏ మాత్రం అనుమానమే లేదు. ఈసారి పులివెందుల టీడీపీదే" అంటూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చెప్పారు.

రా..కదలిరా.. పేరిట శుక్రవారం సాయంత్రం కమలాపురంలో నిర్వహించిన బహిరంగసభలో చంద్రబాబు మాట్లాడుతూ "కరువుతో కడప జిల్లా తీవ్రంగా నష్టపోయింది. కరువు పరిస్థితిని సీఎం జగన్‌కు అధికారులు వివరిస్తే నా జిల్లాలో కరువేంటి అంటూ ఫైలును అధికారుల ముఖాన కొట్టడంతో అధికారులు చిన్నబుచ్చుకుని వెనుదిరిగారు. పులివెందులలో ఇన్నిసార్లు గెలిపించాం, మాకు ఒరగబెట్టిందేమీ లేదని అక్కడి ప్రజలు బాధపడుతున్నారు. సొంత జిల్లాలోనే కరువు ప్రకటించకపోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకోతున్నారు. నేను సీఎం అయింటే కేంద్రాన్ని ఒప్పించి కరువు రైతులను ఆదుకునేవాడిని" అని చంద్రబాబు అన్నారు.

స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేశారా..

ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెండు సార్లు స్టీలు ఫ్యాక్టరీకి శంకుస్థాపనలు చేసి ఫోజులు కొట్టారు. తరువాత ఏమీ లేదు. మీ జీవితాలు బాగుపడ్డాయా.. ఒక్కరికైనా ఉద్యోగం వచ్చిందా.. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేశారా.. కనీసం పిల్ల కాల్వ అయినా తవ్వారా అంటూ చంద్రబాబు ప్రశ్నించారు. రాయలసీమలో అవుకు టన్నెల్ పూర్తి చేసి పులివెందులకు నీళ్లిచ్చి ఎండుతున్న పంటలు కాపాడాం. టీడీపీ హయాంలో సీమ ప్రాజెక్టుల కోసం రూ.20వేలకోట్లు ఖర్చు పెడితే అందులో 20 శాతం కూడా జగన్ ప్రభుత్వం ఖర్చు పెట్టలేదు. దివంగత ఎన్టీఆర్ హయాంలోనే కడప జిల్లాలో తెలుగుగంగ, హంద్రీనీవా, బ్రహ్మంసాగర్, గండికోట ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలో పెండింగు ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. కడప జిల్లాను నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం అన్నారు. తన పాలనలో 90 శాతం సబ్సిడీతో 10 లక్షల మంది రైతులకు డ్రిప్ ఇచ్చామని, జగన్ అటకెక్కించారని అన్నారు. టీడీపీ వచ్చిన వెంటనే డ్రిప్ కొనసాగిస్తామన్నారు.

ఎమ్మెల్యేలపై ఫైర్

జిల్లాలోని ఎమ్మెల్యేలు ఐదేళ్లుగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతుంటే వారిని జగన్ మందలించలేదని, చూసీచూడనట్లు వదిలేశారని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 మంది దళిత ఎమ్మెల్యేలను మార్చారు. అవినీతి ఆరోపణలున్న కడప జిల్లాలో మార్చడం లేదు. ఎక్కడ తిరుగుబాటు చేస్తారోనన్న భయం జగన్‌లో ఉందని చంద్రబాబు మండిపడ్డారు.

పులివెందులలో గెలిచిన జగన్ ఇసుక, మద్యం కబ్జాలు ఇతరత్రా వాటితో రాష్ట్రాన్ని దోచుకుంటే.. పులివెందులలో మాత్రం ఆయన తమ్ముడు మదన్‌మోహన్‌రెడ్డి దోచుకుంటున్నారని అన్నారు. పులివెందుల భూకబ్జాలు, పనుల్లో కమీషన్లు, దళిత మహిళ నాగమ్మ హత్యాచారం ఇలా ఒకటేంటి పులివెందులను చెరబట్టారు. ఇక మేనల్లుడికి దీటుగా ఆస్తులు సంపాదించాలనుకున్న కమలాపురం ఎమ్మెల్యే కరప్షన్ కింగ్‌గా మారారు. లేపాక్షిలో 20వేల కోట్ల విలువ చేసే 9వేల ఎకరాలను చీప్‌గా కొట్టేయాలనుకున్నారు. కడప శివార్లలో 200 కోట్ల విలువ చేసే 54 ఎకరాల భూమి కాజేశారు. సర్వరాయప్రాజెక్టు పరిధిలో 400 ఎకరాలు ఆక్రమించారు. బుగ్గవంకను ఆక్రమించి సినిమా థియేటరును నిర్మించారంటూ మండిపడ్డారు.

ఇక బద్వేలులో 2వేల కోట్ల విలువచేసే భూములు కబ్జా చేశారు. రికార్డులు మార్చేశారు. వైసీపీ నేతలు ఆక్రమించిన భూములు, తిన్న సొమ్మును కక్కిస్తాం. ఇక డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కడపలో హజ్‌హౌస్ కట్టలేని ఉత్సవవిగ్రహం. ఆయన హయాంలో ముస్లింల సంక్షేమం కోసం రూపాయి ఖర్చు పెట్టలేదు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే బెట్టింగ్ ప్రసాద్.. ఆయనకు అభివృద్ధి తెలీదు. ప్రతిపక్షాలపై కేసు నమోదు చేశారు. టీడీపీ బీసీ నేత నందం సుబ్బయ్యను పొట్టనబెట్టుకున్నారు. ఆయన ఆత్మ ఇక్కడే తిరుగుతోంది. తనను హత్య చేసిన వారిని అంతం చేసేంత వరకు వదలదు. కర్ణాటక డీజలు తెచ్చి ప్రొద్దుటూరు పెట్రోలు బంకుల్లో అమ్మాలని ఆదేశిస్తారు. ఆయన మాట్లాడేది బూతులు, చివరికి ఎస్పీని కూడా తిట్టినా పోలీసులకే దిక్కులేదు. మైదుకూరు ఎమ్మెల్యే నంద్యాలంపేటలో 104 ఎకరాలు ఆక్రమించారు. చింతకుంటలో మైనార్టీ నేత అక్బర్‌కు చెందిన భూమిని ఆక్రమించేశారు. ఇసుక, మట్టికి చెరబట్టారు. ఇక జమ్మలమడుగు ఎమ్మెల్యే పేరుకే డాక్టరు. కానీ పెద్ద యాక్టరు. పైకి ఫోజులు లోన మాత్రం పర్సంటేజీలు. చికెన్‌షాపుల నుంచి వాటాలు తీసుకుంటారు. నియోజకవర్గంలోని క్వారీల నుంచి పర్సంటేజీలు తీసుకుంటారు. మైలవరంలోని సోలార్‌ప్రాజెక్టు నుంచి డబ్బులు లాగారు. పెన్నానదిలో ఇసుక దందా చేస్తూ కోట్లు కొల్లగొట్టారు అంటూ చంద్రబాబు ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న మాధవీరెడ్డి ప్రసంగం

బహిరంగసభలో జిల్లాలోని ముఖ్య నేతలతోపాటు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు మాట్లాడారు. వీరందరిలో కడప నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవీరెడ్డి ఒక్కరే మహిళ. దీంతో ఈమె ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. జగన్ ప్రభుత్వం వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ఆమె క్షుణ్ణంగా వివరించారు. జాబు రావాలంటే బాబు రావాలని, దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థ గాడిలో పెట్టాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడపలో కటింగ్‌బాషా, దావత్ బాషాగా పేరు తెచ్చుకున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఒకటిన్నర సంవత్సరంలో తన సొంత ఆస్తి అయిన భారతి సిమెంటును నిర్మించుకున్నారని అది ఆయనకు సొంత ఆస్తులపై ఉన్న మమకారం అన్నారు. అధికారం చేపట్టి ఐదేళ్లు కావస్తున్నా స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం చేయలేదంటూ మండిపడ్డారు.

భారీ జన స్పందన

కమలాపురం సభను టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. దీంతో కడప, పులివెందుల, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జిలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు విజయమ్మ, వరదరాజుల రెడ్డి, జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి, సీఎం సురేశ్‌నాయుడు తదితరుల ఆధ్వర్యంలో జన సమీకరణ చేశారు. వేలాదిగా తరలి వచ్చిన జనం ముఖ్య నేతల ప్రసంగాలతో పాటు చంద్రబాబు ప్రసంగం అయిపోయేవరకు వేచి ఉన్నారు. చంద్రబాబు ప్రసంగానికి చప్పట్లు, కేకలు, ఈలలతో ఉత్సాహంగా స్పందించారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, మైదుకూరు ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్





వేదికపై చంద్రబాబుకు అభివాదం చేస్తున్న హరిప్రసాద్, లింగారెడ్డి

చంద్రబాబు పర్యటన సాగిందిలా..

వెంకటగిరిలో సభ ముగించిన చంద్రబాబు మధ్యాహ్నం 3.32 నిమిషాల ప్రాంతంలో హెలిక్యాప్టరులో కమలాపురం బహిరంగసభ వేదిక వద్దకు చేరుకున్నారు. 4.02 నిమిషాలకు సభ వేదిక పైకి వచ్చారు. సభను టీడీపీ, జనసేన సంయుక్తంగా నిర్వహిస్తుండడంతో సభా వేదికపై ఉన్న ప్రతిఒక్కరికి అభివాదం చేశారు. వేదికపై ఎమ్మెల్సీ రామచంద్రయ్య, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కాల్వ శ్రీనివాసులు, మాజీమంత్రులు అమర్‌నాథరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జిలు పుత్తా నరసింహారెడ్డి, బీటెక్ రవి, పుట్టా సుధాకర్‌యాదవ్, రోశన్న, మాధవీరెడ్డి, భూపేశ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, రమేశ్‌రెడ్డి, విజయమ్మ, మాజీ ఎమ్మెల్సీలు పుల్లయ్య, నారాయణరెడ్డి, శివనాథరెడ్డి, చంద్రదండు వ్యవస్థాపకుడు ప్రకాశ్‌నాయుడు, టీడీపీ నేతలు అమీర్‌బాబు, సీఎం సురేశ్‌నాయుడు, పుత్తా చైతన్యరెడ్డి, పుత్తా లక్ష్మిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, టీడీపీ నేతలు అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, మన్మోహన్‌రెడ్డి, కార్పొరేటరు ఉమాదేవి, రితేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో నిర్వహించిన రా..కదలిరా బహిరంగ సభ వేదికపై చంద్రబాబుతో పాటు టీడీపీ ముఖ్య నేతలు



జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించు

- అంబేడ్కర్ విగ్రహానికి అంగన్వాడీల వినతి

"ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ 39రోజులుగా సమ్మె చేస్తుంటే జగన్ పట్టించుకోవడం లేదు. జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించు" అంటూ అంగన్వాడీలు అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అంగన్వాడీల ఆందోళనలు కొనసాగాయి. కడపలో ఆందోళన శిబిరం నుంచి కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా నినాదాలు చేస్తూ వెళ్లి విగ్రహానికి వినతిపత్రం అందించారు. జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలంటూ జమ్మలమడుగులో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. మైదుకూరులో చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. ప్రొద్దుటూరులో మోకాళ్లపై కూర్చుని ఆందోళన చేశారు. కొండాపురం, బద్వేలు, పోరుమామిళ్లలో అంగన్వాడీల ఆందోళన కొనసాగింది.



కడపలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

పలువురు ఎస్ఐల బదిలీ



కడప (క్రైం), జనవరి 19: జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఖాజీపేట ఎస్ఐ ఎస్.రాజరాజేశ్వర్‌రెడ్డి మైదుకూరుకు, వీఆర్ కడపలో ఉన్న వెంకటరమణ వల్లూరు, వీఎన్ పల్లె నుంచి కుళ్లాయప్ప వీఆర్ కడపకు, వీఆర్ కర్నూలురేంజ్ నుంచి వెంకటరెడ్డి వీఎన్‌పల్లెకు బదిలీ అయ్యారు. అలాగే చెన్నూరు ఎస్ఐ చిన్నపెద్దయ్య వీఆర్ కడపకు, సీకేదిన్నె నుంచి శ్రీనివాసులరెడ్డి కడప డీఎస్‌బీకి, లింగాల నుంచి రవికుమార్ బద్వేలు రూరల్‌కు, కడప ఎస్‌బీ నుంచి ప్రదీప్‌నాయుడు, ఎస్‌కే అన్వర్‌బాషాలు దిశ పోలీస్ స్టేషన్‌కు, వీఆర్ కర్నూలురేంజ్ నుంచి కల్పన జమ్మలమడుగుకు బదిలీ అయ్యారు. వీరంతా తక్షణమే వారికి ఇచ్చిన స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించాలని ఎస్పీ ఆదేశించారు.

ఒక్క చాన్స్‌తో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు

● రా కదలిరా సభలో జగన్ పాలనపై నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల మండిపాటు

చెన్నూరు, జనవరి 19: తాను ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానం నెరవేరుస్తామని.. యువతకు బంగారు భవిష్యత్తు కల్పిస్తామని.. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని... ఒక్కచాన్స్ ఇవ్వాలంటూ.. ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ప్రజలు గమనించి వైసీపీ పాలనకు రాబోవు ఎన్నికల్లో శాశ్వత సమాధి కట్టాలని జిల్లాలోని అన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ధ్వజమెత్తారు. శుక్రవారం కమలాపురంలో జరిగిన రా కదలిరా సభకు హాజరై వారు మాట్లాడారు.



● **కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి** మాట్లాడుతూ సీఎం జగన్ మేనమామ రవీంద్రనాథరెడ్డి అక్రమ మార్గంలో ఆస్తులు సంపాదించుకోవడానికే ఈ నాలుగున్నరేళ్ల కాలం సరిపోయిందన్నారు. కమలాపురం మేజరు పంచాయతీని స్వార్థం కోసం నగర పంచాయతీగా మార్చి ప్రజలకు నరకం చూపించారని.. కనీసం ఉపాధి కూడా లేకుండా చేశారని మండిపడ్డారు. సర్వరాయసాగర్ నీళ్లు ప్రజలకందడం లేదని.. సీఎం జగన్ సొంత అవసరాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. నియోజకవర్గంలోని ఏ మండలంలో కూడా అభివృద్ధి లేదని.. అలాంటి వ్యక్తికి రాబోవు ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పాలని కోరారు.



● **ప్రొద్దుటూరు ఇన్‌చార్జ్ జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి** మాట్లాడుతూ జిల్లాలో ఇప్పుడున్న ఎమ్మెల్యేలు ఒక్క చోటైనా శాశ్వత అభివృద్ధి చేపట్టారా, మీరు అభివృద్ధి చేసి ఉంటే ఎక్కడ చేశారో చెప్పాలని సవాల్ చేశారు. దీనిపై మాట్లాడేందుకు ఏ సమయం.. ఏ తేదీ చెప్పినా తాను చర్చకు సిద్ధ మన్నారు. ప్రజలు ఉమ్మడి జిల్లాలో పది ఎమ్మెల్యే స్థానాలు, రెండు ఎంపీ స్థానాలు కట్టబెడితే.. చివరికి ఎందుకు వీరిని గెలిపించామా అని బాధపడే పరిస్థితికి తీసుకువచ్చారన్నారు.



● **కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి** మాట్లాడుతూ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కడప నగరాన్ని రూ.2150 కోట్లతో అభివృద్ధి చేశామని చెప్పడం సిగ్గుచేటన్నారు. అసలు ఆ అభివృద్ధి ఎక్కడుందో ప్రజలకు చూపించగలవా అని సవాల్ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నాలుగుచోట్ల నాలుగు పనులు చేసి ఇదీ వైసీపీ మార్కు అభివృద్ధి అని చెప్పుకోవడం దారుణమన్నారు.



● **పులివెందుల ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రారెడ్డి** మాట్లాడుతూ జిల్లాలో ఏ నియోజకవర్గం కూడా అభివృద్ధి చెందిన పాపాన పోలేదని.. ముఖ్యంగా సీఎం నియోజకవర్గమే వెనుకబడి ఉందని.. ఏ మాత్రం అభివృద్ధి చెందిందో నియోజకవర్గ ప్రజలకందరికీ తెలుసునన్నారు. చివరికి తల్లి, చెల్లికి కూడా అన్యాయం చేసిన వ్యక్తి నియోజకవర్గానికి, జిల్లాకు ఏం చేస్తారని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

హైలెట్స్

- రా కదలిరా సభకు లక్షకు పైగా ప్రజలు రాక. ఆద్యంతం ఈలలు, చప్పట్లు, కేకలే
- చిన్నారులు, పెద్దలు జెండాలు చేతబట్టి చంద్రన్నకు జై అంటూ విజిల్స్
- వేదిక చుట్టుపక్కల ఉన్న మిద్దెలపై నిలబడ్డ ప్రజలు చంద్రబాబు ప్రసంగిస్తున్నంత సేపు రెండు వేళ్లలో విక్టరీ చూపిస్తూ చప్పట్లు
- ఆటోలో తరలివచ్చిన వృద్ధ మహిళలు, సభ పూర్తయ్యేంత వరకు సభాస్థలిలోనే..
- ఎలాంటి ఇబ్బందులు లేకుండా సభ సక్సెస్ కావడంతో అంతులేని ఆనందంలో కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు
- మూడు కి.మీ మేర స్తంభించిన ట్రాఫిక్
- అయినా ఓపిగ్గా వాహనాలు పక్కన బెట్టి సభాస్థలికి తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు
- ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఓవరాక్షన్‌పై టీడీపీ కార్యకర్తలు, ప్రజల అసహనం
- రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టీడీపీ నేతలు, కార్యకర్తలే దగ్గరుండి చూసుకోవడంతో వచ్చిన వారందరిలో ఆనందం.



రా..కదలిరా.. సభలో రెపరెపలాడుతున్న టీడీపీ జెండాలు

● **జమ్మలమడుగు ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి** మాట్లాడుతూ 2019లో ఓట్ల రాజకీయం చేసి తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి జిల్లా ప్రజలకు అభివృద్ధి అంటే ఏమిటో తెలియకుండా చేశారని మండిపడ్డారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఏం చేయాలో ప్రజలే నిర్ణయించాలన్నారు.

















రా... కదలిరా సభలో మాట్లాడుతున్న నేతలు - మిద్దెలపైకి ఎక్కిన జనం - చంద్రబాబు ప్రసంగానికి ఈలలు వేస్తున్న జనం

కనకదుర్గమ్మ ఆలయ బోర్డు మెంబర్ ప్రభాకర్‌రెడ్డిపై వైసీపీ సర్పంచు ఫిర్యాదు

● పులివెందులలో కేసు నమోదు


పులివెందుల టౌన్,జనవరి 19: వీఎన్‌పల్లె మండలం బుసిరెడ్డిపల్లె సర్పంచు అనురాధ విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ బోర్డు మెంబర్ ప్రభాకర్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వివరాలిలా.. విజయవాడ బెంజ్ సర్కిల్‌లోని నారాయణ కళాశాలలో నా కూతురు ఇంటర్ చదువుతున్న సమయంలో కిడ్నాప్ చేస్తానని... నేను వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఉన్న సమయంలో నాకు పరిచయం అయిన గుంటూరు జిల్లా తాడేపల్లెకు చెందిన ప్రభాకర్‌రెడ్డి 2022లో ఆగస్టులో బెదిరించారు. దీంతో నా కూతురు ఎల్.దీప్తిని ఎక్కడ కిడ్నాప్‌చేస్తారో అని భయపడిన నాభర్త, నా భర్త అన్నలు బాలగంగిరెడ్డి, రామిరెడ్డిలు రూ.10లక్షలు తీసుకెళ్లి తాడేపల్లె పెట్రోల్ బంకు దగ్గర ఇచ్చి వచ్చారు. మళ్లీ ఈ మధ్య కాలంలో జె.ప్రభాకర్‌రెడ్డి తన ఫోన్ ద్వారా నా భర్తఫోన్‌కు ఫోన్ చేయగా.. నేను ఫోన్ తీస్తే.. బూతులు మాట్లాడుతూ నాకు రూ.50లక్షలు తీసుకొచ్చి ఇవ్వకుంటే నీ భర్తను చంపుతానంటూ.. నన్ను అవమానకరంగా దూషించాడు. అతడు, అతని గ్యాంగు వల్ల నా భర్తకు ప్రాణహాని ఉందన్నారు. నా భర్త ప్రాణాలను తీస్తానని బెదిరిస్తున్న జె.ప్రభాకరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరినట్లు ఫిర్యాదులో తెలియజేశారు. ఈ విషయమై సర్పంచు అనురాధ, ఆమె భర్త రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ తనపై ప్రభాకర్‌రెడ్డి తాడేపల్లె పోలీస్‌స్టేషన్‌లో అపద్దపు ఆరోపణలతో ఫిర్యాదు చేశారన్నారు. తాను ఏదో ప్రభాకర్‌రెడ్డి నుంచి డబ్బులు వసూల్ చేశాడని తాడేపల్లె పోలీసులు ఛీటింగ్ కేసు నమోదు చేశారన్నారు.

రేపు నగరంలో శ్రీరామ మహాశోభాయాత్ర



కడప (కల్చరల్), జనవరి 19: అయోధ్య ఐక్యత వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న ఆదివారం కడప నగరంలో శ్రీరామ మహాశోభాయాత్ర జరగనున్నదని ఆ వేదిక ప్రతినిధులు వెల్లడించారు. ఆ మేరకు ఉదయం 7గంటలకు చిన్నచౌకులోని ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి ప్రారంభమవుతుందన్నారు. అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఈనెల 22న శ్రీరామచంద్ర మూర్తి విగ్రహ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో శోభాయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ యాత్ర చిన్నచౌకు, అప్సరసర్కిల్, వైజంక్షన్, ఆర్టీసీ బస్టాండు సర్కిల్, ఎస్పీ బంగ్లా, రాజారెడ్డివీధి, నెహ్రూ పార్కు, అన్నమయ్య సర్కిల్, క్రిష్ణసర్కిల్, గోకుల్ సర్కిల్, వన్‌టౌన్ సర్కిల్, పాత బస్టాండు, సెవన్‌రోడ్స్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, ఐటిఐ సర్కిల్, కాగితాలపెంట, సంధ్య సర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్‌పార్కు మీదుగా హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీకోదండ రామాలయం వరకు సాగుతుందన్నారు. కాగా, ఈనెల 22న ఉదయం 6గంటలకు శ్రీరామనామ హోమం నిర్వహించిన తరువాత భక్తుల స్వహస్తాలతో శ్రీరామలక్ష్మణ సీతా ఆంజనేయుల విగ్రహాలకు 10 గంటల నుంచి అభిషేక కార్యక్రమాలు జరుగుతాయి. అయోధ్యలో రామప్రతిష్ఠ జరిగే సమయంలో ఆలయంలో స్ర్కీన్ ఏర్పాటు చేసి భక్తులకు ప్రతిష్ఠ కార్యక్రమం చూపించే ఏర్పాట్లు చేశారు. శ్రీరామ మహాశోభాయాత్ర కుల మతాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా జరుగుతున్నదని. యాత్రలో పాల్గొనే భక్తులు సంప్రదాయ తెల్లని దుస్తుల్లో పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు. 22న సాయంత్రం పాలకొండపై శ్రీరామ అఖండ దివ్య జ్యోతిని వెలిగించి భక్తులందరూ రామజ్యోతిని దర్శించి శ్రీరామ పరిపూర్ణ అనుగ్రహాన్ని పొందగలరని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెక్క భజన, కోలాటం, కేరళ వాయిద్యం, దేవతా వేషధారణలు, భజరంగి విన్యాసాలతో శ్రీరామచంద్రుని 18 అడుగుల దివ్య విగ్రహంతో ఈ యాత్ర సాగుతుందన్నారు. యాత్ర సందర్భంగా భక్తులకు వివిధ ప్రాంతాల్లో అల్పాహారం, పానకం, భోజన వసతి కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నలుగురికి వీక్లి బెస్ట్ పెర్మార్మెన్స్ అవార్డు



అత్యుత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి అవార్డు అందజేసిన ఎస్పీ

కడప (క్రైం), జనవరి 19: పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి వీక్లీ బెస్ట్ ఫెర్మార్మెన్స్ అవార్డును అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నలుగురు సిబ్బందిని ఎంపిక చేసిన నగదు రివార్డులు, ప్రశంసాపత్రం అందించి ప్రత్యేకంగా అభినందించారు. ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో వాహన తనిఖీల్లో ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.35లక్షల నగదు స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుళ్లు ఎం.శ్రీనివాసులు, నవీన్‌కుమార్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే జమ్మలమడుగు పోలీసుస్టేషన్ పరిధిలో వాహన తనిఖీల్లో ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.5లక్షల నగదు స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుళ్లు నాగేంద్ర, లక్ష్మణ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఆకాంక్షించారు.

సాహిత్యంలో తరగని సంపద వేమన పద్యాలు : కలెక్టర్

కడప(కలెక్టరేట్), జనవరి 19: సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తెలుగు బాషను సరళంగా వర్ణించిన ప్రజా కవి యోగి వేమన అని, తెలుగు సాహిత్య రంగంలో తరగని సంపద అని కలెక్టర్ విజయరామరాజు అభివర్ణించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆటవెలది పద్యాల రూపంలో సామాన్య ప్రజానీకానికి అర్థమయ్యే వాడుక భాషలో అద్భుతమైన కవిత్వాన్ని అందించిన ఘనత యోగి వేమనకు దక్కుతుందన్నారు. సామాజిక రుగ్మతలపై, సమాజ సంస్కరణకు కృషి చేసిన గొప్ప దార్శినికుడు వేమన అన్నారు. వేమన ప్రతి రంగాన్ని నిశితంగా పరిశీలించి నాటి సమాజంలో జరిగే అక్రమాలపై తనదైన శైలిలో నిర్భయంగా, నిజాయితీగా వర్ణించారన్నారు. తెలుగు సాహిత్య, సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన మహనీయుడన్నారు. వేమన ఆవిష్కరించిన నైతిక విలువలను పెంపొందించే కావ్యాలను యువత ఆదర్శంగా తీసుకొని నవ సమాజ సంస్కరణలో భాగస్వాములు కావాలన్నారు.. అంతకుముందు యోగి వేమన చిత్ర పటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. డీఆర్వో గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ ఏవో విజయకుమార్, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ, రిజిస్ట్రార్‌లు

వేమన పద్యాలు వ్యక్తిత్వ వికాసాలు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 19: ఉన్నతమైన వ్యక్తిత్వం అలవడాలంటే వేమన పద్యాలు అర్థం చేసుకుని అనుసరిస్తే చాలని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ అన్నారు. శుక్రవారం వైవీయులో వేమన జయంతి ఉత్సవం నిర్వహించారు. ముందుగా వేమ న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంత రం ఆయన మాట్లాడుతూ మహాకవి వేమన పద్యాలు సమాజాన్ని మేలుకొలుపుతాయన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి మాట్లాడారు. వైవీయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ మాదక్క, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు. కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వేమన జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైస్ చాన్సల ర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈనాటికీ సమాజంలో ప్రజల మధ్య సంభాషణల్లో సామెతలు, వేమనపద్యాలు గుర్తు చేసుకుంటూనే ఉన్నామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసరు రమాదేవి, చింతకుంట శివారెడ్డి, భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, జి.హరి భూషణరావు ఉన్నారు.

ఆర్థిక బకాయిల చెల్లింపులో అలసత్వం వీడాలి

● *ఐఆర్ 30 శాతం ప్రకటించాలి*
● *యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా*



ర్యాలీగా వస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 19: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు బాకీ పడ్డ ఆర్థిక బకాయిల చెల్లింపులో అలసత్వం వీడాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. ఐఆర్ 30 శాతం, పీఆర్సీ విధి విధానాలు, పాత పెన్షన్ విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మహవీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు చెవిలో పువ్వులతో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ సీఎం ప్రతిపక్ష నేతగా పాదయాత్ర సమయంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాలసిన ఆర్థిక బకాయిలు సకాలంలో చెల్లిస్తారని.. మెరుగైన పీఆర్సీ ప్రకటిస్తానని సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులు అడిగేవన్నీ న్యాయబద్ధమైనవేనని దేవుడిదయ వల్ల మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి.. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్నా సమస్యలు పరిష్కరిచకుండా చెవిలో పువ్వులు పెట్టారని, అందుకోసం మా చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన చేపట్టామన్నారు. వృద్ధాప్యంలో అవసరాలకు ఉపయోగపడుతుందని పొదుపులో దాచుకున్న జీవితబీమా సొమ్ము, సరెండరు లీవు బిల్లులు, మెడికల్ రీయిబర్స్‌మెంటు, డీఏ, పీఆర్సీ అరియర్స్ చెల్లించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఓట్ ఫర్ ఓపీఎస్ పేరుతో తమ సమస్యలు ఎవరు పరిష్కరిస్తారో వారి వైపే ఉద్యోగ ఉపాధ్యాయులు ఉంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, శ్రీనివాసులు, ఎజాజ్ అహ్మద్, ప్రభాకర్, అయ్యవారు రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గాజులపల్లె గోపినాథ్, చంద్రశేఖర్, శివశంకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి: కలెక్టర్

కడప(కలెక్టరేట్), జనవరి 19: జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ విజయరామరాజు డీఐఈపీసీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జేసీ గణేశ్‌కుమార్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూత పరిశ్రమల స్థాపనకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్ఠం చేయాలన్నారు. పరిశ్రమలు జిల్లా ఆర్థిక ప్రగతికి మూలమన్నారు. పారిశ్రామికాభివృద్ధి వడ్డీ రాయితీల కింద 13 యూనిట్లకు సంబంధించి రూ.30.6 లక్షల రాయితీ విడుదలకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల జనరల్ మేనేజరు జయలక్ష్మీ, జెడ్‌ఎం నాగరాజు, డిక్కీ కో- ఆర్డినేటర్ శివశంకర్, ఏపీఐఐసీ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు వేగవంతం : జేసీ

కడప(కలెక్టరేట్), జనవరి 19: ఈ నెల 26న నిర్వహించనున్న 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో వేడుకలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఏఎస్పీ కృష్ణారావులతో కలిసి అన్ని శాఖల అధికారులతో జేసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జెండా వందనానికి ఏర్పాట్లు ఎంతవరకు చేశారని ఆరా తీశారు. శకటాల ఏర్పాట్లు, స్టాళ్లు, వేదిక అందంగా అలంకరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తులకు జైలుశిక్ష, జరిమానా

కడప (క్రైం), జనవరి 19: మద్యం సేవించి మోటరు సైకిలు నడుపుతూ పోలీసు తనిఖీల్లో పట్టుబడిన వేర్వేరు వ్యక్తులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కడప ఫస్ట్ స్పెషల్ జేఎస్‌సీఎం కోర్టు తీర్పునిచ్చింది. వివరాలా.. షేక్ షంషీర్ అనే వ్యక్తి ఈ నెల 17న మద్యం సేవించి మోటరు సైకిలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డాడు. దీనిపై కేసు నమోదు చేశారు. విచారణలో సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో కోర్టు ఏడు రోజులు జైలుశిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. అలాగే గజ్జల నాగమల్లారెడ్డి అనే వ్యక్తి ఈనెల 18న మద్యం సేవించి మోటరు సైకిలు వాహనం నడుపుతుండగా పోలీసుల అతన్ని పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ మేరకు అతనికి కోర్టు 4 రోజులు జైలుశిక్ష, రూ.3వేలు జరిమానా విధించినట్లు కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే ధ్యేయం

కడప (క్రైం), జనవరి 19 : పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఎస్పీ సిద్ధార్థ కౌశల్ జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత, స్పౌస్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి ఎస్పీ భరోసా ఇచ్చారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులకు ఆదేశించారు.

రవీంద్రనగర్‌లో చోరీ

కడప (క్రైం), జనవరి 19 : కడప నగరం రవీంద్రనగర్‌లో ఇంటి ముందు పార్కింగ్ చేసిన స్కూటీని ఓ దొంగ తలకు మాస్కు తగలించుకుని చోరీకి పాల్పడ్డాడు. ఆ సంఘటన అక్కడున్న సీసీ కెమెరాలో రికార్డు అయింది. రవీంద్రనగర్‌కు చెందిన ఓ వ్యక్తి రాత్రి ఇంటి ముందు స్కూటీ పార్కింగ్ చేయడంతో గుర్తు తెలియని వ్యక్తి మాస్కు ధరించి.. వీధుల్లో తిరుగుతూ నకిలీ తాళం ద్వారా స్కూటీ లాక్ తీసుకుని అక్కడ నుంచి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేశారు.

సాయినాథశర్మకు సేవా రత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న సాయినాథశర్మ

కమలాపురం (కడప ఎన్టీఆర్ సర్కిల్), జనవరి 19: ప్రజాసేవే లక్ష్యంగా తనదైన శైలిలో పనిచేస్తున్న కమలాపురానికి చెందిన కాశిభట్ల సత్యసాయినాథశర్మ కరోనా సమయంలో చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వ నీతి అయోగ్ సాంఘిక సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఇండియన్ ఐకానిక్ పీస్ కౌన్సిల్ ఆధ్వర్యంలో డాక్టరేట్ అవార్డుతో పాటు సేవా రత్నబిరుదును న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషనల్ క్లబ్‌లో టిబెట్ దేశం ఉపాధ్యక్షుడు ఆచార్య యేషి ప్రదానం చేశారు. శుక్రవారం సాయంత్రం కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు ముఖ్యఅతిథిగా హాజరైన ఈ సమావేశంలో విశిష్ఠ అతిథిగా కేంద్ర ప్రభుత్వం తరపున టిబెట్ దేశ ఉపాధ్యక్షుడు ఆచార్య యేషి విచ్చేశారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డు 2023 సంవత్సరానికి సాయనాథశర్మ ఎంపిక కావడం ఆయన నిస్వార్థ ప్రజా సేవా నిరతికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా సాయినాథశర్మ మాట్లాడుతూ తనకు అవార్డులు వస్తాయని పనిచేయలేదన్నారు. కరోనా కష్టకాలంలో మొదటి విడతలో ఆకలితో అలమటించే వారికి అన్నం పెట్టడం, రెండో విడతలో ఆక్సిజన్ అందక ఇబ్బందులు పడుతున్న అనేక మంది నిరుపేదలకు ఉచితంగా ఆక్సిజన్ సిలిండర్స్ అందించి.. చేతనైనంత సాయం చేశానని అన్నారు.

భారీ జన సమీకరణతో చంద్రబాబు బహిరంగ సభకు


టీడీపీ, జనసేన జెండాలను ఎగురవేస్తున్న అభిమానులు


చంద్రబాబుతో మాట్లాడుతున్న బీటెక్ రవి


చంద్రబాబు సభకు హాజరైన టీడీపీ మహిళా నేతలు

వీరపునాయునిపల్లె, జనవరి 19: కమలాపురంలో జరిగిన మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు బహిరంగ సభ కు మండల వ్యాప్తంగా 22 గ్రామ పంచాయతీల నుంచి శుక్రవారం మండల టీడీపీ కన్వీనర్ బైరె డ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేల మంది భారీ జనసమీకరణతో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గండి ఓబుయ్య యా దవ్, వెంకటరమణారెడ్డి, వాసుదేవరెడ్డి, రాజన్న,సర్పంచు ఓబులేస్, పోలలీస్ రాజ, మురళీమోహన్‌రెడ్డి, గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

చెన్నూరు నుంచి భారీగా తరలింపు

చెన్నూరు, జనవరి 19 : కమలాపురంలో శుక్రవారం నిర్వహించిన రా కదలిరా చంద్రబాబు సభకు చెన్నూరు మండల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివెళ్లారు. మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని గ్రామ పం చాయతీల నుంచి పలురకాల వాహనాల్లో పెద్ద ఎత్తున టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు.మధ్యాహ్నం 1 గంట నుంచి గతం లో ఎన్నడూ లేనంతగా స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలకు టీడీపీ జెండాలు కట్టి 'జై చంద్రబాబు.. జై టీడీపీ జైజై పుత్తా నరసింహారెడ్డి' అంటూ నినాదాలు చేశారు. అలాగే మండల నేతలు ఐ.శివారెడ్డి, షబ్బీర్ హుసేన్, జి.మల్లికార్జునరెడ్డి, కుంచెం రామక్రిష్టారెడ్డి, ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి పాలగిరి సుదర్శన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామకోటిరెడ్డి, రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, కొక్కిరాయపల్లె సర్పంచ్ సూర్యనారాయణ, శివాలపల్లె నేతలు లక్ష్మీకర్‌రెడ్డి, పర్వతరెడ్డి, బలసింగాయపల్లె నేతలు లేవాకు ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి చంద్రబాబు సభకు భారీగా ప్రజలను తరలించారు.

'రా..కదలిరా'కు తరలివెళ్లిన జనం

వల్లూరు, జనవరి 19: మాజీ ముఖ్యమంత్రి, టీ డీపీ అధినేత చంద్రబాబు కమలాపురంలో చేపట్టిన 'రా కదలిరా సమావేశానికి పుత్తా ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ముఖ్యంగా మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి గత నాలుగురోజుల నుం చి జనాన్ని సమీకరించి సమావేశానికి తరలించారు.


చంద్రబాబు సభకు హాజరైన వీఎన్‌పల్లె టీడీపీ నాయకులు

ఈ సందర్భంగా ప్రతి గ్రామం నుంచి ఆ టోలు, ట్రాక్టర్లు, సుమోల ద్వారా కమలాపురానికి తరలివెళ్లారు.

చంద్రబాబు సభకు తరలిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పెండ్లిమర్రి, జనవరి 19: కమలాపురం పట్టణంలో శుక్రవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు హాజరైన రా కదలిరా సభకు మండలంలోని టీడీపీ నేతలు తరలివెళ్లారు. నియోజకవర్గ ఇన్‌చార్జి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల టీడీపీనాయకులు సంగటి గంగిరెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, చంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సారధి, రఘునాథ, అన్నమయ్య, ఈశ్వర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, చెనరాయుడు, రామాంజనేయులు తదితరనాయకులు సమయంలో వందలాది మంది టీడీపీ కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల నుంచి వాహనాల ద్వారా సభకు వెళ్లారు.


మాచునూరు పంచాయతీ నుంచి తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

చంద్రబాబును కలిసిన వికాస్ హరిక్రిష్ణ

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 19: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ కలిశారు. శుక్రవారం కమలాపురం సీఎస్ఐ మైదానంలో జరిగిన రా కదలిరా కార్యక్రమంలో టీడీపీ అధినేతను హరిక్రిష్ణ కలిసి పుష్పగుచ్ఛం అం దించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు పుట్టా సుధాకర్‌యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులపై అవగాహన

లింగాల, జనవరి 19: మండలంలోని ఇప్పట్ల గ్రామంలో పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు విలువల ఆధారిత ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్ సూచించారు. ఇప్పట్ల గ్రామంలో నాల్గవ సంవత్సరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మూడవ రోజు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉద్యాన పంటలు, పశుపోషణ తదితర అంశాలపై సర్వే నర్వహించారు. అతి సులువుగా రాగి మాల్ట్ తోజావా, బప్పాయి జామ్ తదితర ఆహార పదార్థాల తయారీ విధానాలు, నాణ్యత ప్రమాణాలు కనుగొనే విధానాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి నజ్మా, అధ్యాపకులు డాక్టర్ కీర్తిరెడ్డి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రాజశేఖర్, ఎన్.వి.సుబ్బారెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వేతనాలు పెంచమంటే వేదనకు గురి చేస్తారా?

● 39వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె ● అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం


సమ్మె నిర్వహిస్తున్న అంగన్వాడీలు

కడప (నాగరాజుపేట), జనవరి 19 : కనీస వేతనాలు పెంచాలని కోరుతూ గత 39 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే పట్టించుకోకుండా జగన్ ప్రభుత్వం వారిని వేదనకు గురి చేస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో అంగన్వాడీలు తమ డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు.అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోగా మరింత జఠిలం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఉందన్నారు. రాష్ట్రంలో అంగన్వాడీ యూనియన్ల రాష్ట్ర నాయకత్వాలు నిరవధిక దీక్షకు సైతం కూర్చుని ఉన్నారని, ఇదిలా సాగితే వారి ఆరోగ్యాలు ఏం అవుతాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా వీరిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వారి డిమాండ్లు పరిష్కరించాలని అన్నారు.

గ్రామాల్లో తల్లీ బిడ్డల సంరక్షణ కోసం ఎంతో కష్టపడి సేవలందిస్తున్న అంగన్వాడీలకు జగన్ వీధుల్లోకి నెట్టడం సరికాదన్నారు. అనేక డిపార్ట్‌మెంట్లు అంగన్వాడీల సెంటర్లు నడపాలని ప్రయత్నాలు చేసినా ఎవరూ సరిగా చేయలేకపోతున్నారన్నారు. దీన్నిబట్టి అంగన్వాడీల ప్రాముఖ్యత ఎంతుందో అర్థం చేసుకోవాలన్నారు. వేతనాలు పెంచమంటే నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీల ఆవేదనను అర్థం చేసుకుని ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బాదుల్లా, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వసుంధర, పోలమ్మ, సీఐటీయూ నాయకులు పవన్, గిరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గర్జనను విజయవంతం చేయండి

కడప (మారుతీనగర్), జనవరి 19: నేక్‌నామ్ కళాక్షేత్రంలో ఈనెల 21న తలపెట్టిన బీసీ గర్జన సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీసీ సం ఘాల నాయకుడు శ్రీనివాసులు, బీసీ సంక్షేమ సంఘం నేత యూసుఫ్ పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేయండి: చంద్రబాబు

కడప, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పార్టీ నిర్ణయాల మేరకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని చంద్రబాబు ఆదేశించారు. కమలాపురం సభ అనంతరం రోడ్డు మార్గాన కడప విమానాశ్రయం చేరుకున్నారు. వీఐపీ లాంజ్‌లో పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌చార్జి ఆర్.మాధవీరెడ్డి, మాజీ ఇన్‌చార్జి అమీర్‌బాబు, కార్పొరేటరు ఉమాదేవి, లక్ష్మిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేయాలని, గ్రూపులు వద్దని చెప్పినట్లు సమాచారం.

శోభాయాత్రను విజయవంతం చేయాలి


ర్యాలీలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 19: ఆదివారం జరిగే శోభాయాత్రలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వివిధ పార్టీల ప్రతినిధులు పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరం ఎర్రముక్కపల్లె సర్కిల్‌లో శోభాయాత్రకు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు. మాట్లాడుతూ ఆదివారం రాజీవ్ పార్కు నుంచి ఎర్రముక్కపల్లె సర్కిల్, సంధ్యా సర్కిల్, నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిప్యూటీ మేయరు నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు సూర్యనారాయణ, రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, బాలస్వామిరెడ్డి, శ్రీరంజన్‌రెడ్డి, బాలక్రిష్టారెడ్డి, మో తుకూరు సుబ్బరాయుడు, మాజీ కార్పొరేటరు హరినారాయణ, తిరుమలయ్య, సుదర్శనరెడ్డి, బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, చలపతి, శారద, శోభాబాయ్, టీడీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, బొజ్జ తిరుమలేశ్, జనసేన నాయకులు పత్తి చలపతి పాల్గొన్నారు.

యోగి వేమన విశ్వకవి : తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 19: వేమన మహాకవి, మహాయోగి, గొప్ప సంఘ సంస్కర్త అని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. మహాకవి వేమన జయంతిని కాంగ్రెస్ నాయకులు, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఈ సం సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ వేమన విశ్వకవి అన్నారు. సమాజంలోని మూఢాచారాలను, అరాచకాలను, ఆకృత్యాలను, అ న్యాయాలను, డాబు దర్పాలను తన కవితా ఖడ్గముతో చీల్చి చెండాడిన కవితా ఖడ్గ తిక్కన వేమన అన్నారు. వేమన పద్యాలు ఒక్కొక్కటి ఒక బ్రహ్మాస్త్రం అన్నారు. ప్రొద్దుటూరు రెడ్ల సంఘం ప్రతినిధి అంజన్‌రెడ్డి, రెడ్ల కమ్యూనిటీ, డెవలప్‌మెంట్ సొసైటీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, ఉత్తన్న, అమర్, రాజా, రమేష్, సత్తార్, రవి, బద్రి, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చక్రాయపేట, జనవరి 19: వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం గండి వీరాంజనేయస్వామి దేవస్థానాన్ని దర్శించుకొని అనంతరం చక్రాయపేట మండలంలోని మారెళ్లమడక గ్రామంలో జరిగే వైఎస్సార్ ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరై అక్కడి డాక్టర్లు, సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం సమీపంలోని బీసీకాలనీలో డ్రైడేని పరిశీలించారు. వారితో మాట్లాడుతూ దోమతెరలు వాడాలని,వేడినీళ్లు తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాణి నవనీత, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

కులగణనకు సహకరించండి

వేంపల్లె, జనవరి 19: మండల వ్యాప్తంగా జరుగుతున్న కులగణన కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని ఎంపీడీఓ దివిజ కోరారు. వేంపల్లెలో కులగణన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కులగణన చేసే ఏర్పాట్లు చేశారు. ప్రతి ఒక్కరి కులాన్ని నమోదు చేయాలని ఎంపీడీఓ ఉద్యోగులను ఆదేశించారు.

స్వామి వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగాలి

వేంపల్లె, జనవరి 19: స్వామి వివేకానంద స్ఫూర్తితో విద్యార్థులు జీవితంలో ముందుకు సాగాలని గంగా రూరల్ ఎన్విరాన్‌మెంటల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు శివకృష్ణ తెలిపారు. స్థానిక అక్షర జూనియర్ కళాశాలలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. కెనెరా బబ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సందీప్‌కుమార్‌రెడ్డి, సాయికుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

'జీఎస్టీని పూర్తిగా తొలగించాలి'

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 19 : జీఎస్టీని పూర్తిగా తొలగించాలని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. 67వ జీవిత బీమా జాతీయాకరణ దినం సందర్భంగా శుక్రవారం కడప ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమం సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, సిరికల్చర్ ఉద్యోగుల సంఘం రాష్ట అధ్యక్షుడు వెంకట రామరాజు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓబులేసు, పెన్షనర్ల సంఘం నేతలు, ఎల్ఐసీ యూనియన్ నేతలు పాల్గొన్నారు.


టీడీపీ అధినేత చంద్రబాబు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ సీనియర్ నేత అమీర్‌బాబు

డీఎస్సీలో ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి: రూటా


వినతిపత్రం అందిస్తున్న రూటా ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 19: త్వరలో నిర్వహించనున్న డీఎస్సీలో ఉర్దూ మీడియం ఉపాధ్యాయ ఖాళీలన్నీ భర్తీ చేయాలని రూటా ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం అన్నమయ్య జిల్లాలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్‌ను తన కార్యాలయంలో కలిసి రూటా ప్రతినిధులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రూటా ప్రతినిధులు మహ్మద్ అయుబ్, జాఫరుద్దీన్, రెహ్మాన్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా సరిపడా ఉపాధ్యాయులు లేక ఉర్దూ మీడియం విద్యార్థులు ఎంతో నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే డీఎస్సీలో ఖాళీలన్నీ భర్తీ చేయాలని కోరారు. రూటా ప్రతినిధులు మహ్మద్ ఖాసిం, ఉమయుద్దీన్, షబ్బీర్, సాదిక్ ఆలీషా, జబీవుల్లా, షహనవాజ్, నాసిర్, ఇబ్రహీం, జాహిద్‌షా తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక విప్లవకారుడు వేమన


వేమనకు నివాళులర్పిస్తున్న చంద్ర తదితరులు

కడప (సెవెన్ రోడ్స్), జనవరి 19:సమాజంలో ఉన్న సాంఘిక అసమానతలు, మూఢనమ్మకాలపై పోరాడిన తెలుగు తాత్వికుడు, విశ్వకవి, సాంఘిక విప్లవకారుడు వేమన అని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కొనియాడారు. శుక్రవారం వేమన జయంతి సందర్భంగా వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ నైతిక విలువలు, మూఢనమ్మకాలు, కులమత ఛాందసవాదం, వివక్షపై అనేక పద్యాలు రచించి తన పద్యాల ద్వారా సమాజాన్ని చైతన్యపరచిన మహా వ్యక్తి, సంఘ సంస్కర్త, ప్రజాకవి వేమన అన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు సుబ్బారెడ్డి, ద్రవిడ సురేష్, సీపీఐ నాయకులు మోహన్‌రెడ్డి, సంజీవ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఓబుల్‌రెడ్డి, శివరాం, డాక్టర్ ఎం.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

వల్లూరు, జనవరి 19 : కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వల్లూరు పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వంచే నిర్వహించబడుతున్న వికసిత్ భారత్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని లేబాక, కొప్పోలి గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయి అధికారులతో పాటు బీజేపీ అధికార ప్రతినిధి పాలెం శ్రీకాంత్ హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వల పథకం కింద గ్యాస్, రేషన్ బియ్యం, బ్యాంకు సిబ్బంది ద్వారా అందిస్తున్న రుణాలు, పోస్టల్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ వికసిత్ భారత్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామ పంచయాతీలోకి వెళ్లి ప్రధాని మోదీ ప్రజలకందిస్తున్న సంక్షేమ పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. పాలెం శ్రీకాంత్ మాట్లాడుతూ ఎక్కడాలేని విధంగా భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులతో పాటు గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కార్మికవర్గానికి దిక్సూచి లెనిన్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

కడప (సెవెన్ రోడ్స్), జనవరి 19 : ప్రపంచంలో మొట్టమొదటి కార్మికవర్గ రాజ్యం, సోషలిస్టు సమాజం, యూనియన్ ఆఫ్ సోషలిస్ట్ సోవియెట్ రష్యా 17 దేశాల సమ్మేళన నిర్మాణం రూపశిల్పి కామ్రేడ్ లెనిన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యు లు రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులరెడ్డి, దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప సీపీఎం జిల్లా కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి సభల ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెనిన్ 1924 జనవరి 21న మరణించాడని, రేపటికి వంద సంవత్సరాలు అవుతుందన్నారు. తయన శత వర్ధంతి సభలను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారన్నారు. ఈ నెల 21 నుంచి జిల్లాలోని మండల, పట్టణ, నగర జిల్లా కేంద్రాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో మోదీ హయాంలో గ్రామీణ ఉపాధి తగ్గిపోతుందన్నారు. పట్టణంలో నిరుద్యోగం పెరుగుతోందన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభు త్వం జవాబుదారీతనం లేకుండా ఏకపక్షంగా పనిచేస్తోందన్నారు. అంగన్వాడీ, ఆశాలు, మున్సిపల్ వర్కర్లు, వలంటీర్లు, సర్వశిక్ష అభియాన్ తదితర అన్ని రంగాల వారు తమ కనీస వేతనాల కోసం సమ్మె చేపడుతుంటే కనీసం పట్టించుకునే పాపాన పోలేదన్నారు. వీరికి ప్రజలు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. అంగన్వాడీల సమ్మెకు ఉద్యోగ, ఉపాధ్యాయ, యావత్ కార్మికవర్గం అండగా నిలుస్తోందన్నారు. అవసరమైతే ఎర్రజెండా అండగా నిలిచి రాష్ట్ర బంద్ కూడా నిర్వహిస్తుందని హెచ్చరించారు.


మహనీయుల పేర్లు అవమానిస్తే సహించేది లేదు

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 19 :ప్రపంచ మేధావులైన కారల్ మార్క్స్, లెనిన్ పేర్లను అవమానిస్తే సహించేదిలేదని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జి ల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ హెచ్చరించారు. ఇటీవల గుంటూరు కారం సినిమాలో విలన్లకు మహనీయుల పేర్లు పెట్టి అవమానించిన చిత్రదర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ క్షమాపణ చెప్పాలన్నారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కడప పూలే సర్కిల్ వద్ద త్రివిక్రమ్ శ్రీనివాస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ ప్రపంచ గతిని మార్చిన గొప్ప చరిత్ర నిర్మాత కారల్ మార్క్స్‌కు ఉందన్నారు. చిరుప్రాయంలోనే ప్రపంచ వ్యా ప్తంగా కార్మికవర్గ రాజ్యస్థాపనకు త్యాగాలు చేసిన మహోన్నత వ్యక్తి దోపిడీదారుల సింహస్వప్నం కారల్ మార్క్స్ అన్నారు. అలాంటి చరిత్రకారులను సినిమాలోని విలన్‌లకు వారి పేర్లు పెట్టి అత్యంత దుర్మార్గంగా చూపించడం దారుణమన్నారు. వెంటనే విలన్లకు పెట్టిన ఆ పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. త్రివిక్రంపై ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. డీవైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, నగర కార్యదర్శి ఓబులేసు, నాయకులు ఉదయ్, పవన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

'ఐఆర్ తక్షణం ప్రకటించాలి'

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 19: ఉద్యోగ ఉద్యాయులకు తక్షణం మధ్యంతర భృతి ప్రకటి ంచాలని ఎస్టీ ఎస్సీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున డిమాం డ్ చేశారు. శుక్రవారం కడప నగరం ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కా ర్యాలయంలో ఆయన ముఖ్య నాయకులు సమావేశంలో మాట్లాడుతూ పెండింగులో ఉన్న డీఏలన్నీ అలాగే ఆర్థిక సంబంధమైన లావాదేవీలన్నీ తక్షణం చెల్లించాలని కోరారు. భారతీయులందరి గుండెల్లో శాశ్వతంగా కొలువై ఉన్న భారత రాజ్యాంగనిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం విజయవాడలో ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు శేషగిరిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు, జిల్లా కార్యదర్శి పట్టా గంగాధర్ పాల్గొన్నారు.

ఏపీ జేఏసీ జిల్లా మహిళా చైర్ పర్సన్‌గా విజయకుమారి


ఏపీ జేఏసీ మహిళా విభాగం జిల్లా కమిటీ

కడప(కలెక్టరేట్), జనవరి 19: ఏపీ జేఏసీ కడప జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా రెవెన్యూ శాఖ ఉద్యోగిని మేరి విజయకుమారి ఎన్నికయ్యారు. శుక్రవారం కడపలోని రెవెన్యూ భవనంలో ఏపీజేఏసీ ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్ అధ్యక్షతన కడప జిల్లా మహిళా ఉద్యోగ సంఘం సమావేశం జరిగింది. ఎన్నికల్లో జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా ఎం.మేరి విజయమారి, ప్రధాన కార్యదర్శిగా ఆర్టీసీ ఉద్యోగిని విజయమ్మ,కోశాధికారిగా కో-ఆపరేటివ్ ఉద్యోగిని కమల, సెక్రటరీగా సుజాత, కో- చైర్‌పర్సన్‌గా శిరీష, పద్మావతి, ప్రియాంక, విజయమ్మ కలిసి మొత్తం 13 మందితో మహిళా విభాగం కమిటీని ఎంపిక చేశారు.

చంద్రబాబు సభకు తరలిన పసుపుదండు


చంద్రబాబుకు బొకే ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, కొండారెడ్డి


చంద్రబాబుకు బొకే ఇస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి


చంద్రబాబు సభకు హాజరైన భూపేశ్‌రెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, సీఆర్సీ

ప్రొద్దుటూరు, జనవరి 19 : జగన్ అరాచకప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా చంద్రబాబు చేపడుతున్న రా.. కదలిరా సభకు ప్రొద్దుటూరునుంచి కమలాపురానికి వేలాదిగా టీడీపీ శ్రేణులు కదిలివెళ్ళాయి. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే నంద్యాలవరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో బైపాస్‌లోని శ్రీదేవి కళ్యాణ మండపం నుంచి హౌసింగ్ బోర్డు కొర్రపాడు రోడ్డు శివాలయం వీధి మైదుకూరు రోడ్డు ఎర్రగుంట్ల రోడ్డుల మీదుగా వందలాది వాహనాల్లో కార్యకర్తలతో తరలివెళ్ళారు. కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి, బచ్చల పుల్లయ్య, ఆసం రఘురామిరెడ్డి ఘంటశాల వెంకటేశ్వర్లు,మాజీ ఎంపీపీలు సర్పంచ్‌లు కౌన్సిలర్లు తదితర నాయకులు వెళ్ళారు.

టీడీపీ నాయకుడు సురేశ్‌నాయుడు ఆధ్వర్యంలో..: కొర్రపాడు రోడ్డులోని అన్నాక్యాంటీన్‌నుంచి శివాలయం వీధి మైదుకూరురోడ్డు ఎర్రగుంట్లరోడ్డు పోట్లదుర్తి మీదుగా వందలాది వాహనాల్లో టీడీపీ కార్యకర్తలు కమలాపురం తరలి వెళ్ళారు. సీఎం సురేష్ నాయుడు మోటారు సైకిల్ మీద ఎక్కి కార్యకర్తలకుకలిసి అభివాదం చేసుకుంటూ కమలాపురం వెళ్ళారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీఎస్ ముక్తియార్, మాజీ ఎంపీపీ శెట్టి పల్లె ప్రభాకర్‌రెడ్డి, బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి,ఈవీ సుధాకర్‌రెడ్డి,ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో..: రా.. కదలిరా సభకు వైఎంఆర్‌కాలనీ లోని తన స్వగృహంనుంచి వాహనాల్లో బయలు దేరి వెళ్ళారు. కొర్రపాడు రోడ్డు మైదుకూరు రోడ్డు గాంధీరోడ్డుల గుండా ఎర్రగుంట్ల రోడ్డు మార్గాన ర్యాలీగా వాహనాల్లో తలివెళ్ళారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వైఎస్‌జబీవుల్లా కౌన్సిలర్ మహమ్మద్ గౌస్, బండి భాస్కర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితర నేతలు తరలివెళ్ళారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు నియోజకవర్గ కేంద్రనుంచి శుక్రవారం ఉదయం 10 గంటలకు కమలాపురం రా కదిలిరా సభకు


ఖాజీపేట నుంచి తరలివెళుతున్న టీడీపీ నాయకులు


చాపాడు నుంచి తరలివెళుతున్న టీడీపీ నాయకులు


చంద్రబాబు సభకు హాజరైన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తదితరులు


బద్వేలు నుంచి చంద్రబాబు సభకు తరలివెళుతున్న టీడీపీ నేతలు



మాట్లాడుతున్న సీఎం సురేశ్‌నాయుడు, భోజనాలు ఏర్పాటు, భారీగా పాల్గొన్న మహిళలు

భారీగా వాహనాలతో కదిలి వెళ్ళారు. టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జమ్మలమడుగు,మైలవరం, పెద్దముడియం ప్రాంతాల నుంచి నేరుగాఎర్రగుంట్ల మీదుగా కమలాపురానికి భారీగా తరలి వెళ్ళారు.దాదాపు 400 వాహనాలకు పైగా బస్సులు లారీలలో కార్యకర్తలు వెళ్ళారు.

ఖాజీపేట..: ఖాజీపేట మండలం నుంచి భారీగా కార్యకర్తలతో టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో కమలాపురానికి తరలివెళ్లారు. ఖాజీపేట నుంచి నాలుగు బస్సులు, వంద కార్లలో తరలివెళ్లడం జరిగిందన్నారు. వచ్చిన వారికి అయ్యప్పస్వామి గుడి వద్ద భోజనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కరరెడ్డి, పోకల వెంకటసుబ్బారెడ్డి, వెంకటేశ్, మల్లికార్జునరెడ్డి, జానకీరాం,మహబూబ్‌బాషా, నంద్యాల సుబ్బయ్య, క్రిష్టారెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, చిన్న, పుల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: కమలాపురంలో చంద్రబాబు హాజరైన రా..కదిలిరా సభకు పసుపుదండు వేలాదిగా తరలివెళ్లింది. కార్యకర్తలు, నాయకులు అభిమానులు పెద్దఎత్తున వివిధ మండలాల నుంచి వాహనాల్లో ఎర్రగుంట్ల, పోట్లదుర్తికి చేరుకున్నారు. ఎర్రగుంట్ల కడపరోడ్డులో జమ్మలముడుగు ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోజన వసతి శిబిరానికి చేరుకుని భోజనం అనంతరం వాహనాల్లో ఉత్సాహంతో తరలివెళ్లారు.

● **పోట్లదుర్తికి చేరుకున్న అభిమానులు..:** కమలాపురం సభకు వెళ్లేందుకు పోట్లదుర్తి, ప్రొద్దుటూరు నుంచి భారీగా వచ్చారు. అక్కడే వాహనాల పార్కింగ్ చేర్పాటు చేశారు. సుమారు పదివేలమందికి టీడీపీ నాయకుడు సిఎం.సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో భోజనాల వసతి ఏర్పాటు చేశారు.1000కి పైబడి మోటార్‌సైకిళ్లతో సీఎంసురేశ్‌నాయుడు, వీయస్ ముక్తియార్ ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం.సురేష్‌నాయుడు మీడియాతో మాట్లాడుతూ జగన్ ఇలాకాలోనే ఈవిధంగా నూతనోత్సాహంతో ప్రజలు పాల్గొనడంతో ఇక జగన్‌కు ఓటమి తప్పదని తెలిసిపోయిందన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

చాపాడు..: కమలాపురంలో శుక్రవారం జరిగిన రా కదలిరా టీడీపీ బహిరంగ సభకు మండలంలోని పలు గ్రామాలనుండి టీడీపీ నాయకులు కార్యకర్తలు తరలివెళ్ళారు. మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, ప్రదాన కార్యదర్శి సుదర్శన్, టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, అక్బర్‌వల్లి ,కిరణ్‌కుమార్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి , మేకలబాబు,వీరశేఖర్‌రెడ్డి, వీరనారాయణ, సుబ్బరాయుడు అక్బర్ సలీం తదితరు వెళ్ళారు. కాగా చంద్రబాబు నాయుడును టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి కలిశారు. చంద్రబాబుకు శాలువ కప్పి సన్మానించారు.

రాజుపాలెం..: రా..కదలిరా కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు కమలాపురం పర్యటన సందర్భంగా శుక్రవారం హెలిప్యాడ్ వద్ద మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు టీడీపీ నాయకుడు మెట్టుపల్లి ప్రభాకర్‌రెడ్డి శాలువా కప్పి బొకే అందించారు.

బద్వేలు టౌన్..: కమలాపురంలో నిర్వహించే రా కదలిరా కార్యక్రమానికి బద్వేలు నుంచి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌కుమార్‌రెడ్డ ఆధ్వర్యంలో సుమారు 400 వాహనాలు, 20వేల మంది టీడీపీ కార్యకర్తలు, నాయకులతో భారీ ర్యాలీగా తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మాట్లాడుతూ వైసీపీ అరాచకపాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

కొండాపురం..: చంద్రబాబు శుక్రవారం కమలాపురంలో నిర్వహించిన రా..కదలిరా బహిరంగ సభకు మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి , టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గోరుశెట్టిబాబు భారీగా వాహనాలలో తరలి వెళ్లారు.


మోటారు సైకిల్‌పై కమలాపురం వెళుతున్న సీఎం సురేశ్‌నాయుడు


ర్యాలీలో అభివాదం చేస్తున్న ప్రవీణ్‌రెడ్డి


ర్యాలీలో కారుపై వెళుతున్న వరదరాజులరెడ్డి, కొండారెడ్డి


చంద్రబాబుకు బొకే ఇస్తున్న మెట్టుపల్లి ప్రభాకర్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి


జమ్మలమడుగు నుంచి కమలాపురానికి బయలుదేరిన వాహనాలు


చంద్రబాబు సభకు హాజరైన లింగారెడ్డి, రితీష్‌రెడ్డి

బీసీ గర్జనను జయప్రదం చేయండి

బద్వేలు, జనవరి19ః ఈ నెల 21వ తేదీన కడపలోని కళాక్షేత్రంలో నిర్వహించే బీసీ గర్జనను రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పూలే జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి. గురుమూర్తి, బద్వేలు పౌరవేదిక కన్వీనర్ ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పౌరవేదిక కార్యాలయంలో బీసి.గర్జన వాల్‌పోస్టర్ల ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు పీరయ్య, ఆవాజ్ కమిటీ పట్టణ అధ్యక్షుడు సత్తార్, దళిత సంఘం నాయకుడు శింగరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి

ప్రొద్దుటూరు ,జనవరి 19 : జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నేతలు ఆగ్రహించారు. శుక్రవారం విజయవాడలో జరుగుతున్న ఆమరణ దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు మద్దతుగా స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మోకాళ్ళపై కూర్చోని నిరసన చేపట్టారు.

'జగన్ మా చెవిలో క్యాలీఫ్లవర్ పెట్టారు'

మైదుకూరు, జనవరి 19 : చదువులు చెప్పే గురువులకే సీఎం జగన్ చెవిలో ఫ్లవర్ కాదు క్యాలీఫ్లవరే పెట్టాడంటూ వాటిని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మైదుకూరులో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వై రవి కుమార్, నాయకులు రాము, శ్రీనివాసులు, ప్రతాప్, శ్రీనివాసులు, పోతులూరయ్య తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

పోరుమామిళ్ల, జనవరి 19 :హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, కేశవులు తహసీల్దారు గంగయ్యకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారు తహసీల్దారు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగసముద్రం పంచాయతీ పరిధిలోని సర్వే నెం.1008/2ఎ1లో నివాసం ఉంటున్న తిరుపతిరెడ్డి కాలనీలకు కోర్టు ఆర్డరు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వారు మాట్లాడుతూ తిరుపతిరెడ్డికాలనీవాసులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని తహసీల్దార్లకు వినతులు ఇచ్చినా స్పందించకపోవడం దౌర్భాగ్యమన్నారు, ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు కొందరు దొంగ సొసైటీ పేర్లతో డబ్బులు వసూలు చేసి కోర్టులను తప్పుదోవ పట్టించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెంకటేశ్వర్లు, ఓబులేసు, శ్రీనివాసులు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

రాజకీయ భవిష్యత్తు టీడీపీతోనే : భూపేశ్‌రెడ్డి


టీడీపీ కార్యాలయంలో భూపేశ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరికలు

జమ్మలమడుగు ,జనవరి 19 : రాబోయే రోజులలో రాజకీయ భవిష్యత్తు టీడీపీతోనే అని జమ్మలమడుగు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు శుక్రవారం పెద్దముడియం మండలం బోడితిప్పనపాడు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ చేరాయి. పార్టీలో చేరిన వారిలో మాధవరెడ్డి, నరాల రామసుబ్బారెడ్డి, వెంకటరాముడు, హుస్సాన్ వల్లి , శ్రీనివాసులు,బాలరాజు ఉన్నారు.

ఉద్యోగులను వంచించిన జగన్ సర్కార్

బద్వేలు, జనవరి19ః ఉద్యోగ, ఉపాధ్యాయులను జగన్ సర్కార్ అన్ని రకాలుగా వచించిందని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఓబుల్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో చెవిలో పూలు పెట్టుకుని స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో ఉద్యోగులు అడగడుగునా మోసపోతూనే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవానందం, సుధాకర్, సహ అధ్యక్షుడు ఎం.నరేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెన్నయ్య, చక్రపాణి, పాలా శ్రీనివాసులరెడ్డి, మస్తాన్‌రెడ్డి, శివ ప్రసాద్, ఈశ్వరయ్య, ఓబన్న ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమం గాలికి వదిలేసిన ప్రభుత్వం

పోరుమామిళ్ల, జనవరి 19 : ఉద్యోగుల సంక్షేమాన్ని రాష్ట ప్రభుత్వం గాలికి వదిలేసిందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్య ఆరోపించారు. శుక్రవారం పోరుమామిళ్లలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చాక హామీ విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కౌన్సిలరు జయరామయ్య, ఈశ్వర్‌రావు, చెన్నక్రిష్ణయ్య, సిద్దయ్య, సింహరాయలు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన పలువురు నేతలు


చ్రందబాబు సమక్షంలో టీడీపీలోకి చేరుతున్న గంగవరం శేఖర్‌రెడ్డి

ఎర్రగుంట్ల, జనవరి 19: ఎర్రగుంట్లకుచెందిన వైసీపీ కో ఆప్షన్ సభ్యురాలు అస్మబాయ్‌గారి సాధకున్ టీడీపిలోకి చేరారు. శుక్రవారం ఆమె, ఆమె భర్త చిన్నసేట్‌కు భూపేశ్‌రెడ్డి వారికి టీడీపీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈమె గతంలో ఎర్రగుంట్లలోని 18వవార్డుకౌన్సిలర్‌గా టీడీపీ నుంచి గెలిచారు.

● వైసీపీ సీనియర్ నాయకుడు గంగవరం కూడా... వైసీపీలో తీవ్ర అసంతృప్తితో ఉన్న సీనియర్ నాయకుడు గంగవరం శేఖర్‌రెడ్డి టీడీపీలో శుక్రవారం చేరారు. టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో, సి.భూపేష్‌రెడ్డి నేతృత్వంలో ఆయన టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో ఆయన వైసీపీకి బాగా పనిచేశారు.

బ్రహ్మంగారి హుండీ ఆదాయం రూ.37లక్షలు

బ్రహ్మంగారిమఠం, జనవరి 19 : వీరబ్రహ్మేంద్రస్వామి కానుకల ప్రధాన హుండీలను పూర్వపు మఠాధిపతి కుమారుల ఆధ్వర్యంలో ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ పర్యవేక్షణలో దేవస్థానం ఆవరణలో లెక్కించారు. అందులో రూ.37,12,145 నగదు, అలాగే బంగారు 8 గ్రాములు, వెండి 475 గ్రాములు వచ్చినట్లు మేనేజరు ఈశ్వరయ్యాచారి తెలిపారు. నంద్యాల దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, పూర్వపు మఠాధిపతి కుమారులు వెంకటాద్రిస్వామి, గోవిందస్వామి, మఠం యాజమాన్యం భక్తులు పాల్గొన్నారు.

సడలని అంగన్వాడీల నిరసన

మైదుకూరు, జనవరి 19 : తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి 39 రోజులకు చేరుకుంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద చేపడుతున్న ఆందోళన కొనసాగుతోంది. నాయకురాళ్ళు చేవిలో పూలు పెట్టుకొని భీష్మించి కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్ళు పాల్గొన్నారు.

కొండాపురం..: మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు 39వ రోజు శుక్రవారం కొండాపురంలో తమ నిరసన ను కొనసాగించారు.జీతాలు పెంచి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటీయు, ఏఐటీయూసీ నేతలు తారాదేవి,పద్మ,వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: అంగన్వాడీలను భయభ్రాంతులకు గురిచేసి విధుల్లో చేర్చే యత్నం చేస్తున్న సీడీపీవోను సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్ అన్నారు. పోరుమామిళ్ల తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరింది. కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.



మైదుకూరులో చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు, పోరుమామిళ్లలో నిరసన తెలుపుతున్న దృశ్యం

జమ్మలమడుగు..: జగన్ ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా చేయండి అని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు విమర్శించారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 39 వరోజుకు చేరుకుంది. అంబేడ్కర్ చిత్ర పటానికి వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, నేతలు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: అంగన్వాడీల సమ్మెలోభాగంగా శుక్రవారం స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. నెల్లూరురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ



జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, కొండయ్య, రాజగోపాల్, ముడియం చిన్ని, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.